
# పుట్టిల్లు



—డా॥ కొఠారి వాణీచలపతిరావు

ఉత్సాహంతో చకచకా సూట్‌కేస్‌లో బట్టలు సర్దుకుంటూ ఉంది రుక్మిణమ్మ. నాలుగు వెంకటగిరి జరి చీరలు, రెండు కట్టుడు చీరలు, రవికలు ఒకదానివెంట ఒకటి పెట్టేసి సూట్‌కేస్ మూత వేస్తుంటే అప్పుడు వచ్చింది రోహిణి.

"అమ్మమ్మా ఎక్కడకి వెళ్తున్నావ్?" అంది తలంటి పోసిన జుట్టును దువ్వెనతో దువ్వుకుంటూ.

"ఊరికి వెళ్తున్నాను" అంది రుక్మిణమ్మ కడిగిన ముత్యంలా ఉన్న మనవరాలివంక మురిపెంగా చూస్తూ.

"ఏ ఊరు?"

"మా ఊరే?"

"ఇది మీ ఊరు కాదా?"

"ఇది మీ తాతయ్యగారి ఊరు. మా ఊరు అంటే నేను పుట్టిన ఊరు. మా పుట్టిల్లు అన్నమాట" అంది రుక్మిణమ్మ. ఆమాటలంటున్నప్పుడు ఆమెకళ్ళల్లో మెరిసిన ఆనంధం, గర్వం రోహిణికి వింతగా కనిపించాయి.

"అక్కడ ఎవరున్నారు?" అని ప్రశ్నించింది రోహిణి అమాయకంగా.

"మా అమ్మ ఉంది, మా నాన్న ఉన్నారు, మా తమ్ముడు ఉన్నాడు"

"అమ్మమ్మా మా అమ్మకు నువ్వు అమ్మవు కదా నీకు కూడా మళ్ళీ అమ్మ ఉందా?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది రోహిణి.

"ఎందుకుండదు?అందరికీ అమ్మ ఉంటుంది. అమ్మ లేకుండా నేనెలా పుడతాను? నువ్వు మీ అమ్మకు ఎలా పుట్టావో నేనూ అలాగే మా అమ్మకు పుట్టాను,"అంది రుక్మిణమ్మ బుల్లి మనవరాలికి వచ్చిన అతిబుల్లి సందేహానికి సమాధానం చెప్తూ.

రోహిణికి అంతా గమ్మత్తుగా, కొత్తగా అనిపించిందేమో గంతులేస్తూ, చప్పట్లు చరుస్తూ "భలే! భలే! అమ్మమ్మకు అమ్మ!" అంటూ తెగ సంతోషపడి పోయింది. ఆ తర్వాత రుక్మిణమ్మకు దగ్గరగా వచ్చి "అమ్మమ్మా! నీ వెంట మీ ఊరికి నేను కూడా రావద్దా. మీ అమ్మను చూస్తాను ప్లీజ్. నన్ను కూడా తీసికెళ్ళవూ." అంది గడ్డంకింద చెయ్యి వేసి బ్రతిమిలాడుతూ.

అసలే రోహిణి రుక్మిణమ్మ గారాల మనవరాలేమో అలా జాలిగా ముఖం పెట్టి అడగటంతో ఇట్టే కరిగిపోయింది. "తీసి కెళ్తాను గానీ మీ అమ్మను వదిలి పెట్టి మూడు, నాలుగు రోజులు ఉండగలవా మరి?" అంది.

"ఓ! ఎంచక్కా ఉంటాను"

"అయితేవెళ్ళి మీ అమ్మని అడిగిరా వెళ్ళమంటే నీ ఫ్రాకులు తెచ్చేసుకో. సూట్‌కేస్‌లో పెట్టేస్తాను". ఆ మాటలు చెవుల బడగానే లేడిపిల్లలా ఛెంగున మంచం మీద నుండి కిందికి దూకి తుర్రున తల్లి ఉన్న గదివైపు పరుగెత్తింది రోహిణి.

వెళ్ళిన ఐదునిముషాల్లోనే బట్టలతో సహా హాజరయింది,

"అమ్మ వెళ్ళమంది అమ్మమ్మా" అంటూ. కూతురు వెంటే తల్లి ఉన్న గదిలోకి వచ్చిన శ్యామల,

"దాన్ని తీసికెళ్తే నిన్ను ఒక చోట కుదురుగా ఉండనిస్తుందా అమ్మా? అసలే అల్లరిపిల్ల. ఏం విసిగిస్తుందో ఏమో" అంది.

"ఏం కాదులే రానీ. తాతమ్మగారి ఊరు చూడాలని ముచ్చట పడుతున్నది. మీ అమ్మమ్మ మాత్రం దీన్ని ఎప్పుడు చూసిందని ఎప్పుడో ఉయ్యాలలో పిల్లగా ఉన్నప్పుడు వచ్చింది." అంది రుక్మిణమ్మ మనవరాలి ఫ్రాకులు మడతపెట్టి సూట్ కేసులో పెడుతూ. చంటి పిల్ల కూడా వెంట వస్తూండటంతో క్యారేజి, మంచి నీళ్ళ మరచెంబు కూడా ప్రయాణానికి సిద్ధం చేసింది రుక్మిణమ్మ సాయంత్రం మూడు గంటలకే రైలు.

రోహిణి ఆనందం, హడావుడీ ఇంతా అంతా అని చెప్పటానికి వీలులేదు.

వాళ్ళని రైలెక్కించడానికి స్టేషన్‌కి పురుషోత్తమ రావుగారే వచ్చారు.

"జాగ్రత్త. నీ కసలే ప్రయాణాలు చేయడం అలవాటు లేదు. ఏ స్టేషన్‌లో కూడా ప్లాట్‌ఫాం మీద దిగకు. బండి కదిలితే నువ్వు ఎక్కలేవు". అంటూ రైలుకదిలేవరకూ భార్యకు జాగ్రత్తలు

చెబుతూనే ఉన్నారు ఆయన.

ఎప్పుడూ ఎక్కువగా గడపదాటి బయట కాలు పెట్టని ఆమె ఉన్నట్టుండి అకస్మాత్తుగా పుట్టింటికి ప్రయాణం కట్టింది. 'ఈ వయసులో నీకు పుట్టింటి మీదకు మనసు పోయిందా?' అని పరిహాస మాడితే మీరు ఒంటరిగా ఉండలేరనే నేను ఇన్నాళ్ళ నుండీ ఇల్లు విడిచి ఎక్కడికీ వెళ్ళటం లేదు. ఎప్పుడూ ఇట్టావచ్చి అట్టా వెళ్ళే అమ్మాయి ఈసారి పది, పదిహేను రోజులు ఉంటానని రావడంతో ఇంటిని, మిమ్మల్నీ దానికి ఒప్పచెప్పి పోతున్నాను, మూడంటే మూడే రోజుల్లో తిరిగి వచ్చేస్తాగా' అని సర్దిచెప్పింది. ఎన్నడూ నాకిది కావాలని కోరని ఇల్లాలు ఈనాడు నోరుతెరిచి అదీ ఇన్నేళ్ళ తర్వాత పుట్టింటికి వెళతానని అడిగితే ఆయన కాదనలేకపోయారు.

రైలుపెట్టెలో ఎక్కీఎక్కగానే పరుగున వెళ్ళి కిటికీ దగ్గర ఉన్న సీటులో కూర్చుంది రోహిణి.

రైలు ముందు కెళుతూ ఉంటే, గిరగిరా తిరుగుతూ వెనక్కు వెళ్ళి పోతున్న చెట్లవంక, దుబ్బుల వంక చూస్తూ తెగ ఆనంద పడిపోతోంది.

రుక్మిణమ్మ కంపార్ట్‌మెంట్‌లో ఉందనే గానీ ఆమె మనసు మాత్రం అక్కడలేదు. అది ఆమెకన్నా ముందే ప్రయాణం చేసి చేరవలసిన చోటుకి చేరిపోయింది. పుట్టింటి ఆ పరిసరాలు ఆ వాతావరణం తలుచుకొని తలుచుకొని ఆమె ఆనందపడి పోతోంది.

ఎప్పుడెప్పుడు ఆ రైలు తను దిగవలసిన స్టేషన్ కుచేరుకుంటుందా అని ఎదురుచూస్తోంది.

చివరకు ఎలాగైతేనేం ఆరుగంటల ప్రయాణం తర్వాత తీరుబడిగా 'గొల్లపూడి' స్టేషన్‌లో వచ్చి ఆగింది రైలు.

పసుపు పచ్చటి బోర్డు మీద ఉన్న నల్లటి ఆ అక్షరాలు చదువుతూంటే చెప్పలేనంత సంతోషం కలిగింది రుక్మిణమ్మకు. 'అబ్బ! ఎన్ని సంవత్సరాలు అయింది ఈ వూరువచ్చి' అనుకుంది.

మెల్లిగా మనవరాలి చెయ్యి పట్టుకుని దాన్ని ముందు కిందికి దింపి తరువాత తను సూట్‌కేస్ పట్టుకొని దిగింది. 'తను అనుకోకుండా ప్రయాణం కావడంతో స్టేషన్‌కు తమ్ముడు వచ్చే అవకాశం లేదు' అనుకుని,

ఊళ్ళో ఇంటిముందు దింపేటట్లు పదిహేను రూపాయలకు రిక్షా మాట్లాడింది. రిక్షాముందుకు సాగి ఊరి పొలిమేరలలోకి ప్రవేశిస్తూ ఉంటే రుక్మిణమ్మ మనసు గత స్మృతులలోకి జారిపోయింది.

"రోహిణీ! అదిగో ఆ కనిపిస్తున్న స్కూలు బిల్డింగ్ చూసావా ఆ స్కూలులోనే నేను చిన్నప్పుడు చదువుకున్నాను"

"ఏది ఆ పాత బిల్డింగా? అమ్మమ్మా! అసలు నువ్వు ఎంత వరకు చదువుకున్నావ్?" అమ్మమ్మ వంక చూస్తూ ఆసక్తిగా ప్రశ్నించింది రోహిణి.

"ఆ రోజుల్లో ఆడపిల్లల్ని బయటకు పంపించి ఎక్కువగా చదివించే వాళ్ళు కాదు. అప్పుడు ఈ స్కూల్లో ఎనిమిదవ తరగతి వరకు ఉండేది. అంతవరకే చదివాను"

"అమ్మమ్మా! నువ్వు ఎనిమిదో క్లాసేనా చదివింది" అని పెదాలకు చెయ్యి అడ్డం పెట్టుకొని గమ్మత్తుగా నవ్వింది రోహిణి.

రుక్మిణమ్మ కూడా మనవరాలి నవ్వుతో జత కలుపుతున్నట్లు మందహాసం చేసింది.

"అదిగో రాములవారి గుడివచ్చింది దణ్ణం పెట్టుకో. ఈ గుడికి నేను మా అమ్మతో ప్రతిరోజూ వచ్చేదాన్ని. దసరాపండగకి ఇక్కడే బతుకమ్మలాడే వాళ్ళం స్నేహితులమంతా కలిసి"

అని ఇలా దారిపొడుగునా తన చిన్నతనపు ముచ్చట్లు మనవరాలికి వినిపిస్తూనే ఉంది రుక్మిణమ్మ.

అమ్మమ్మ చెబుతున్న ప్రతిమాటా రోహిణికి విచిత్రంగా అనిపిస్తున్నది.

నెరసిన జుట్టుతో, పెద్దకుంకుమ బొట్టుతో, చత్వారపు కళ్ళ జోడుతో ఉన్న ఇప్పటి అమ్మమ్మ రూపాన్ని బుల్లి బుల్లిగౌన్లలో పొట్టిలంగాలలో ఊహించుకుంటుంటే గమ్మత్తుగా ఉంది.



## నోట్లపైమరకలు

పదిరూపాయల నోట్లు, యాభై, వంద రూపాయల నోట్ల పై పొరపాటున ఏవైనా మరకలు పడితే ఎవరూ తీసుకోరు. ముఖ్యంగా నూనె వంటి పదార్థాలు గ్రీజ్ ఆయిల్ వంటివి పడినపుడు వాటిని తొలగించటం మామూలుగా సాధ్యపడదు. ఈ మరకలు పోవాలంటే ఒకటే మార్గం. పెట్రోలుని కొద్దిగా తీసుకుని దానిలో నోటుని కాస్సేపు నాననీయండి. పెట్రోలు నోటుపై మరకని పీల్చివేస్తుంది. మరక పూర్తిగా తొలగకపోతే కాస్త మెల్లిగామరక ఉన్నచోట వ్రేలితో రుద్దండి చాలు.

భోశ్రీ

పలకా, బలపం పట్టుకొని స్కూలుకు వెళుతున్న అమ్మమ్మ రూపం కళ్ళ ముందు మెదలగానే ఉన్నట్టుండి పక్కున నవ్వింది రోహిణి.

"ఎందుకే అలా నవ్వావు?" అంది రుక్మిణమ్మ మట్టిరోడ్డుకు అటుపక్క ఇటుపక్క కనిపిస్తున్న ఇళ్ళ వైపునుండి చూపు మరల్చకుండానే.

"ఏం లేదులే. నవ్వొచ్చింది నవ్వాను. అవును గానీ అమ్మమ్మా మీ ఇల్లు ఇంకా ఎంతదూరం ఉంది?"

"మీ ఇల్లు ఏమిటే? తాతమ్మగారి ఇల్లు అనాలి. అదిగో ఆమలుపు తిరగగానే ఇల్లు ఎదురుగా కనిపిస్తుంది" అంది రుక్మిణమ్మ.

రిక్షా మలుపు తిరిగింది.

రుక్మిణమ్మ వళ్ళంతా కళ్ళు చేసుకొని ఆ ఇంటివంక తమకంగా చూసింది.

ఎర్రటి బెంగళూరు పెంకు కప్పు, ఎర్రమన్ను పట్టాలు వేసిన సున్నం గోడలు, పెద్దగేటు చూస్తూ

'అబ్బ! ఎన్నాళ్ళయింది ఈ ఊరినీ, ఈ ఇంటినీ చూసి' అనుకుంది.

"ఇదేనా ఇల్లు?" అంది రోహిణి.

"ఇదే! ఏయ్ రిక్షా అబ్బాయ్ ఇదిగో ఈ ఇంటి ముందు ఆపు గేటు తీసి రిక్షాలోపలికి తీసుకెళ్ళు" అంది రుక్మిణమ్మ

గేటు చప్పుడు రిక్షా గజ్జల చప్పుడు విని అక్కడే నులకమంచం మీద కూర్చున్న ఓ పండు ముసలమ్మ తలెత్తి చూసింది. భారంగా ముగ్గుబుట్టలాంటి తెల్లటి తల, ముడతలు పడ్డ వళ్ళు, బాగా వంగిపోయిన నడుంతో ఉన్న ఆమె దగ్గరికి వెళ్ళి "బాగున్నావా అమ్మా" అంది రుక్మిణమ్మ ఆప్యాయంగా తల్లి రెండు చేతులు పట్టుకుని.

"ఎవరు? రుక్మిణమ్మా ఓ సోసి ఎప్పుడొచ్చావే? వస్తున్నట్లు ఉత్తరం ముక్క అయినా రాయలేదేం" అంది కూతుర్ని ప్రేమగా అక్కున చేర్చుకుంటూ

దూరంగా నిల్చుని ఈదృశ్యాన్ని విచిత్రంగా చూస్తున్న రోహిణినిచూసి,

"అక్కడ నిల్చున్న ఆ పిల్ల ఎవరు? చూపు సరిగా ఆనటం లేదు" అంది ఆ వృద్ధురాలు కళ్ళకు చెయ్యి అడ్డం పెట్టుకుని చూస్తూ.

"అది నీ మునిమనవరాలు అమ్మా రోహిణి. శ్యామల కూతురు" అంది రుక్మిణమ్మ

"శ్యామల కూతురా? ఎంత పెద్దది అయింది! ఉయ్యాల్లో ఉన్నప్పుడు చూసాను. ఇక్కడికి రావే మునిమనవరాలా దగ్గరికిరా, ఎట్లా ఉన్నావో చూస్తాను. నీ పేరేమిటో అన్నది మీ అమ్మమ్మ" అంది బోసినవ్వుతో.

"రోహిణి"

"రోహిణి! బాగుంది పేరు. నేను ఎవరో తెలుసటే నీకు?"

"ఓ! తెల్సు అమ్మమ్మ అమ్మ"

"అమ్మమ్మ అమ్మేమిటి నీ ముఖం. తాతమ్మ అను. నన్ను మొట్టమొదట తాతమ్మను చేసావనే ఆనందం పట్టలేక నీ బారసాలకు వచ్చి నీ చేతులకు మురుగులు తొడిగాను నేను. అప్పుడే చూడటం. ఏదో పెద్ద దాన్నయిపోయాను. కళ్ళు కనపడవు, కాళ్ళు కదలవు మీరైనా వచ్చి చూసి పోతారనుకుంటే ఎప్పుడూ చదువులు, ఉద్యోగాలు అంటూ ఎప్పటికప్పుడే దాటేస్తూ ఉంటారు. అన్నట్లు వచ్చిన వాళ్ళను గుమ్మంలోనే నిల్చోబెట్టి మాట్లాడుతున్నాను. అక్కడ బకెట్లో నీళ్ళున్నాయి. కాళ్ళుకడుక్కొని లోపలికి రండి" అంది నడుముకు చెయ్యి ఆనించుకొని అడుగులో అడుగువేసి నడుస్తూ.

"మీ మరదలు పుట్టింటికి వెళ్ళింది. తల్లికి సుస్తీగా ఉందని తెలిస్తే చూడటానికి. తమ్ముడు పొలానికి వెళ్ళాడు. మీ నాన్న సంధ్యవార్చుకుంటున్నట్లున్నారు." అంటూనే వంటింటివైపు వెళ్ళింది, ఆమె వెనకనే రుక్మిణమ్మ రోహిణి వెళ్ళారు. ఎర్రటి పట్టు బట్ట కట్టుకుని, ముఖానికి,

చేతులకి విభూతి రేఖలు పూసుకుని దేవుడి గూటి ముందు కూర్చుని మంత్రాలు చదువుతున్న ఒక ముసలి ఆకారం మీద పడింది రోహిణి దృష్టి.

ఆయనకు కనుబొమలు కూడా తెల్లగా నెరసి ఉన్నాయి. బుగ్గలు సొట్టలు పడి ఉన్నాయి.

నుదుటి మీద ముడతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రుక్మిణమ్మను చూడగానే ఆయనకళ్ళు ఆనందంతో మిలమిలా మెరిసాయి.

"ఇదేనా రావటం అమ్మాయ్. అంతా కులాసాయేనా? ఇది శ్యామల కూతురు కదూ? మా మునిమనవరాలు"అంటూ కుశల ప్రశ్నలు వేశారు ఆయన. రోహిణికి మాత్రం ఆ ఇల్లు అక్కడి వాతావరణం, ఆ మనుషులు, వాళ్ళ మాటలు అన్నీ చాలా కొత్తగా అనిపించాయి.

ఎప్పుడూ చూసే అమ్మమ్మ కూడా ఈరోజు కొత్తగా అనిపిస్తున్నది.

అరవైయేళ్ళ అమ్మమ్మ అకస్మాత్తుగా తనంత చిన్నదై పోయినట్లు అనిపిస్తున్నది, అనుకుంది విస్మయంగా. అలా రోహిణిని- ఆశ్చర్యంలో ముంచెత్తే సంఘటనలు ఆ రెండు, మూడు రోజుల్లో మరెన్నో జరిగాయి.

ఆ సాయంత్రం ఆరుబయట అందరూ మంచాలు వేసుకుని కూర్చున్నారు.

ఇంతలో ఓ ముసలమ్మ చాలాస్థూలకాయురాలు ఆయాసపడుతూ హడావుడిగా వచ్చింది.

"రుక్మిణమ్మ వచ్చిందట కదా ఊరునించి, ఆ మాటవినగానే నా ప్రాణం లేచివచ్చింది, ఎన్నేళ్ళయిందో దాన్ని చూసి" అంటూ దాదాపు రుక్మిణమ్మను కావలించుకున్నంత పనిచేసింది, ఆనందంతో. 'ఈమె దాదాపు అమ్మమ్మ వయసుదే. కాకుంటే ముఖాన కుంకుమ బొట్టు లేదు' అనుకుంది రోహిణి ఆమెవంకచూస్తూ.

"బాగున్నావా వెంకాయమ్మా కొడుకులు, కూతుళ్లు మనవళ్ళు, మనవరాళ్ళు అంతా బాగున్నారా?" అంటూ కుశలప్రశ్నలు వేసింది రుక్మిణమ్మ

"రోహిణీ! ఇలా రావే!" అంటూ దగ్గరికి పిల్చి "ఇది మా మనవరాలు." అంటూ పరిచయం చేసింది. "రోహిణీ! ఈమె ఎవరో తెల్సా మాక్లాస్ మేట్. చిన్నప్పుడు మేం ఇద్దరం ఒకే క్లాసులో ఒకే బెంచీలో కూర్చుని చదువుకున్నాం. ఇద్దరం కల్సి పచ్చీసు ఆడుకునే వాళ్ళం. పొలాల గట్ల వెంబడి తిరిగి వడినిండా గోరింటాకు కోసు కొచ్చుకునే వాళ్ళం. దొంగతనంగాతోటల్లోజొరబడిబంతిపూలు, గోరింటపూలు'కోసుకొచ్చు కునేవాళ్ళం. అవును గానీ వెంకాయమ్మా ఎప్పుడూ మనతోటే తిరిగేది మంగతాయరు అది ఇప్పుడు ఎక్కడుంది?" అంటూ సడన్‌గా మనవరాలి గురించి మర్చిపోయి బాల్యస్నేహితుల జ్ఞాపకాల్లో మునిగిపోయింది రుక్మిణమ్మ

"అది ఇంకా ఎక్కడుంది? పోయి నాలుగేళ్ళు అవుతుంటేనూ?" అంటూ దీర్ఘం తీసింది వెంకాయమ్మ

స్నేహితురాళ్ళిద్దరూ పరిసరాలను, పక్కనున్న వారిని మర్చిపోయి చాలా సేపు కబుర్లు చెప్పుకున్నారు.

లంగా, ఓణీవేసుక్కుని తుళ్ళుతూ, గెంతుతూ తిరుగుతున్న అమ్మమ్మ రూపం కళ్ళళ్ళో మెదిలి తనలో తనే ముసిముసి నవ్వులు నవ్వుకుంది రోహిణి.

ఆ రెండు రోజులూ తీర్థప్రజల్లా ఆ ఊరిజనం ఒకరి వెంట ఒకరుగా రావటం అమ్మమ్మను కలవటం, చిన్నప్పటి కబుర్లు చెప్పటం అంతా గమనిస్తూనే ఉంది రోహిణి.

**********

ఆ రోజే తన బట్టలు, మనవరాలి బట్టలు సూట్‌కేసులో సర్ది తిరుగు ప్రయాణానికి సిద్ధమైంది రుక్మిణమ్మ

"రాక రాక వచ్చావు నాలుగు రోజులైనా ఉండకుండా అప్పుడే ప్రయాణ మేమిటే అక్కయ్యా" అన్నాడు రుక్మిణమ్మ తమ్ముడైన రాజేశ్వరరావు.

### డైనింగ్ టేబుల్ పై మరకలు

ఈ రోజుల్లో డైనింగ్ టేబుల్ ప్రతి ఇంట్లోనూ ఉంటోంది. చూడ్డానికి డైనింగ్ టేబుల్ పెద్దదిగా, అందంగా, ఆకర్షణీయంగా ఉంటే చాలదు. అది తప్పని సరిగా పరిశుభ్రంగా ఉండితీరాలి. దానిపై మురికి చేరుకుంటే ఈగలూ, దోమలూ చేరి చికాకు పరుస్తాయి. ఈ ఇబ్బంది కల్గకుండా ఉండాలంటే కొబ్బరి నూనెలో కొంచెం హారతి కర్పూరం వేసి కల్పి డైనింగ్ టేబుల్ పై రాయాలి. అలాచేస్తే టేబుల్‌పై మురికి వదిలి దుర్వాసన రాకుండా ఉంటుంది.

భోశ్రీ

"అల్లుడు గారు కూడావచ్చిఉంటేబాగుండేది. ఆయనగారు మా ఊరువచ్చి ఎన్నేళ్ళయిందో" అన్నారు రుక్మిణమ్మ తండ్రిగారు.

"ఆయన రారులే నాన్నా. 'షష్టి పూర్తి కూడా చేసుకున్నాను. కొత్తల్లుడిలా ఈవయసులో అత్తగారింటికి వెళ్తే అందరూ నవ్వుతారు' అంటారు." అంది రుక్మిణమ్మ సమాధానంగా.

"ఎంత వయసు వస్తే మాత్రం నీకు ఇది పుట్టిల్లు కాకుండా పోతుందా ఆయనకి అత్తిల్లు కాకుండా పోతుందా"అంది రుక్మిణమ్మ తల్లి ఒక పళ్ళెంలో పసుపూ, కుంకుమా ఆకువక్కా, చీరా, రెవికలగుడ్డ పెట్టుకుని బయటికి వస్తూ.

"ఇప్పుడివన్నీ ఎందుకమ్మా ?" అంది రుక్మిణమ్మ నుదుటన బొట్టు పెడుతున్న తల్లితో.

"పుట్టింటి ,చీరా సారే మొహమాటానికైనా వద్దనకూడదు. మా నట్టింట నువ్వు కొత్త చీరకట్టుకొని ఎన్నాళ్ళయిందో, ఈ సారి ఈ చీర కట్టుకొనే వెళ్ళాలి" అంది భారంగా ముందుకు వంగి కూతురి కాళ్ళకు పసుపురాస్తూ.

రుక్మిణమ్మతో పాటే రోహిణికి కూడా బొట్టు పెట్టి పరికిణి బట్ట, జాకెట్ బట్ట చేతిలో పెట్టింది ఆమె. కొత్తచీరకట్టుకుని తల్లికి, తండ్రికి వంగి నమస్కారం చేసింది రుక్మిణమ్మ

"దీర్ఘసుమంగళీ భవ" అని దీవించారు ఇద్దరూ ఒకేసారి, 'ఆమాటలకు అర్థం ఏమిటో ఆ తరువాత అమ్మమ్మను అడిగి తెలుసుకోవాలి' అనుకుంది రోహిణి తనలో తాను.

"వెళ్ళొస్తానమ్మా వెళ్ళొస్తాను నాన్నా" అంటూ ఎడ్లబండిలో మనవరాలితో ఎక్కికూర్చుంది రుక్మిణమ్మ

ఆ మాటలంటున్నప్పుడు ఆమె కంఠం రుద్ధమైంది.

బండిలో కూర్చున్న అమ్మమ్మ పమిట కొంగుతో కళ్ళు అద్దుకోవడం, క్రింద నిల్చున్న తాతమ్మ కళ్ళు తడిగావటం ఈ రెండూ గమనించింది రోహిణి.

రుక్మిణమ్మ తండ్రి బండి వెనకాలే కొంత దూరం వరకు వచ్చారు.

"ఇంక మీరు నడవలేరు ఉండండి నాన్నా" అంది రుక్మిణమ్మతండ్రి నుద్దేశించి. "ఇంక ఉంటానమ్మా అప్పుడప్పుడు వస్తూవుండు మేమూ పెద్దవాళ్ళమై పోతున్నాం" అన్నారు ఆయన. వెనక్కి వెళ్ళి పోబోయిన ఆయన ముఖం విచారంగా కనిపించింది. బండి ఊరి పొలిమేరలు దాటేవరకు పమిట కొంగుతో కళ్ళతడి అద్దుకుంటూనే ఉంది రుక్మిణమ్మ

తను శలవులకు అమ్మమ్మగారి ఊరువచ్చినప్పుడుల్లా వెళ్ళేముందు ఇలాంటి దృశ్యాన్నే చూస్తోంది రోహిణి.

అమ్మమ్మ అమ్మ ఇద్దరూ కళ్ళ నీళ్ళు పెట్టుకోవడం తాతయ్య విచారంగా ఉండటం,

మామయ్య రైలువరకు వచ్చి ఎక్కించి, వెనుదిరిగి వెళ్ళి పోవడం ఇవన్నీ.

ఇప్పుడు అమ్మమ్మ వాళ్ళ అమ్మ దగ్గరికి వస్తే మళ్ళీ అచ్చం అలాగే అదేదృశ్యం అంటూ ఆలోచించింది రోహిణి చిన్నారి మనసు.

'ప్రతి స్త్రీకి పుట్టిల్లు ఒక మధురమైన అనుభూతి. పుట్టింటి నుండి వీడ్కోలు తీసుకునే ఆ సమయం మాటల కందని బాధతో కూడిన ఒక విచిత్రానుభవం' అన్న విషయం రోహిణికి ఇంకా తెలియని వయసాయె.

'జన్మనిచ్చిన వారు<br>
జన్మించిన ఊరు<br>
పెరిగి పెద్దదైన ఇల్లు'

ఈ మూడూ కలిసి స్త్రీకి పుట్టింటిపై అభిమానాన్ని కలిగిస్తాయి. ఎన్నేళ్ళు వచ్చినా, ఎంత పెద్దయినా ఆ అభిమానం చెక్కు చెదరకుండా ఆమెలో అలాగే ఉంటుంది,

అందుకే స్త్రీ జీవితంలో పుట్టింటికి అంత ప్రాధాన్యత, అన్న విషయం రోహిణికి కూడా ముందుముందు తెలుస్తుంది. తనూ ఒక ఆడపిల్లే కదామరి!